వినాయక విగ్రహాల నిమజ్జనాలను సజావుగా జరిపిస్తాం.. మేయర్ విజయలక్ష్మి

అల్వాల్ సర్కిల్‌లో చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ విజయలక్ష్మి

మల్కాజిగిరి, ఆగస్టు 30: వినాయక విగ్రహాల నిమజ్జనాలు సజావుగా జరిపిస్తామని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం అల్వాల్ సర్కిల్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనాలపై చెరువు వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని,చెరువు వద్ద లైట్లు, బారికేడ్లు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీం అందుబాటులో ఉంచుతామని అన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్, పారిశుధ్య, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, జితేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో అన్నదాన కార్యక్రమం

కీసరగుట్టకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ తెలిపారు. శుక్రవారం కీసరగుట్టలో భక్తులకు ఆల యం తరుపున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం విచ్చేసిన చాలామంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. – కీసర, ఆగస్టు 30

పోచారం పోలీస్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

పోచారం పోలీస్టేషన్ భవణ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపురం సర్వే నంబర్ 808లో రెండు ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఏసీపీ ఎస్.చక్రపాణి, సీఐ రాజు, రెవెన్యూ అధికారులు భూమి పూజ నిర్వహించారు. గ్రామ అధికారులు, నాయకులు పాల్గొన్నారు. – ఘట్‌కేసర్, ఆగస్టు 30

పార్టీలకతీతంగా అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

- ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 30 : పార్టీలకతీతంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతశ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని, వెనుకబడిన కాలనీలపై దృష్టిపెట్టాలని సూచించారు. అనంతరం వార్డుకు రూ.30 లక్షలు సీసీ రోడ్డు, అంతర్గత మురికి కాలవల నిర్మాణానికి కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానం చేశారు. వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలకు రూ.9 లక్షలు కేటాయించారు. వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి,కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

పేదలు కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో శుక్రవారం 56 మందికి కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ అశోక్, చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో నూ ..

జవహర్‌నగర్ : పేదింటి ఆడ బిడ్డలకు ఆసరగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ తాసీల్ మీటింగ్ హాల్‌లో కాప్రా తాసీల్దార్ సుచరితా అధ్యక్షతన శుక్రవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ రాజేందర్‌ల సమక్షంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై 198మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మేయర్ శాంతి, మాజీ మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్లు, కోఆప్షన్‌సభ్యులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

8నెలలకు చెక్కులు అందజేయడం దారుణం..

పెండ్లి పందిరిలోనే ఆడబ్డిలకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాలు అందజేస్తే బాగుంటుందని, 8నెలల తర్వాత చెక్కులు అందజేయడం దారుణమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వాఖ్యానించారు. తులం బంగారం ఇస్తామని ఆడబిడ్డలకు ఊకదంపుడు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 9నెలలు గడుస్తున్నా బంగారంపై మాట ఎత్తకపోవడం దుర్మార్గమన్నారు.

చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

గుండ్లపోచంపల్లిలో..

మేడ్చల్ : మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్‌లను ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 100 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌లు చీర్ల రమేశ్, ప్రభాకర్, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

పంపిణీపై కాంగ్రెస్ అభ్యంతరం..

మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంపై కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయానికి కాంగ్రెస్ నాయకులు చేరుకొని, అధికారులతో వాగ్వివాదానికి దిగారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాకుండా చెక్కులను ఎలా పంపిణీ చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు అక్కడే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులతో ఎదురు దాడికి దిగారు. ఇది పార్టీ కార్యక్రమం కాదని, మీ నియోజకవర్గ ఇన్‌చార్జికి ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎంపీ ప్రజాప్రతినిధులని వారి ఆధ్వర్యంలోనే ప్రభుత్వ కార్యక్రమాలను జరుగుతాయని, ప్రొటోకాల్ గురించి తెలుసుకొని రావాలని సమాధానమిచ్చారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగారం మున్సిపాలిటీలో అధికారులతో కలసి చైర్మన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, అధికారులు రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. – మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 30

మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ న్యూ నర్సింహనగర్ కాలనీలో ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ జె. ప్రభుదాస్, సేవా సమితి నిర్వాహకులు. – మల్లాపూర్, ఆగస్టు 30

శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ

- హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఆగస్టు 30 : ఉప్పల్-హబ్సిగూడ ప్రధాన రహదారిలోని ఎన్జీఆర్ఐ గేట్ సమీపంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతాముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్రశర్మ, ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ మేరకు ఆలయ ముఖద్వారం వద్ద గుమ్మడికాయ కొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా చేపట్టిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని, వేద పండితుల ఆశీర్వాదం తీసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, డోనర్ సంతోష్‌నంద, ఈఓ భాగ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఆలయ ట్రస్టీలు, బోర్డు సభ్యులు, నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, కొకొండ జగన్, శ్రీనివాస్ యాదవ్, ఆకుల మహేందర్, జైనవీన్, జెట్ట కిశోర్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసిన కాప్రా డీసీ జగన్

కాప్రా సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ జగన్ శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకోవాలని డీసీకి సూచించారు. కాప్రా శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ పాల్గొన్నారు. – కాప్రా, ఆగస్టు 30

రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన ఉప్పల్ సెయింట్ మార్క్స్ స్కూల్ విద్యార్థులు ఈశ్వర్, లిఖితలకు నాచారంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో నిర్వాహకులు షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తమ పాఠశాలకు 'స్కూల్ ఎక్సలెన్సీ' అవార్డును అందజేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సమీర్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను స్కూలు యాజమాన్యం, సిబ్బంది అభినందించారు. – ఉప్పల్

అభివృద్ధి పనుల ప్రారంభం

కమ్యునిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తదితరులు

నేరేడ్‌మెట్, ఆగస్టు 30 : వినాయక నగర్ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వినాయకనగర్ డివిజన్ వీధి నంబర్ 22లో రూ. 22 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ పనులను ఆమె ప్రారంభించారు. ఏఈ సత్యలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, కాలనీ వాసులు శశి, బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు ఓఓం ప్రకాశ్, సాయి నరేశ్, శ్రీకాంత్, గోపాల్, జగదీశ్, చారి, శివ పాల్గొన్నారు.

టంక్‌లైన్ పూడికతీత పనులు..

పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శాంతి

ఉప్పల్, ఆగస్టు 30 : ట్రంక్‌లైన్ పూడికతీత పనులను సత్వరం పూర్తిచేసి, వరదనీటి ఇబ్బందులు తొలగించాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారం డివిజన్‌లోని ఇందిరానగర్ ట్రంక్‌లైన్ పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పనులను కార్పొరేటర్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. నేతలు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, సంజన్న, కట్ట బుచ్చన్న, గియాసుద్దీన్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

చిలుకానగర్ డివిజన్‌లోని శివాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా శివాలయ నిర్మాణానికి తగిన తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ దాసరి కృష్ణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. – ఉప్పల్, ఆగస్టు 30

చిరువ్యాపారస్తులకు అవకాశం ఇవ్వాలి

ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో చిరువ్యాపారస్తులకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిశారు. భగాయత్‌లోని నివాసం ఉండేవారికి కావాల్సిన చిరు వ్యాపారాలకు తగిన అనుమతి ఇవ్వాలని కోరారు. జీఓ నంబర్ 33 ప్రకారం గృహ నిర్మాణ స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసుకొని చిరు వ్యాపారం చేసుకొనే అవకాశం కల్పించాలని, దీనిపై పరిశీలించాలని కోరారు. అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్‌రెడ్డి, ఒక్కంటి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. – ఉప్పల్

గ్రంథాలయం కాలనీ నీటి సమస్య పరిష్కరించాలి

కీసరలోని గ్రంథాలయం కాలనీలో ఉన్న బోరు రిపేర్ కావడంతో బయటికి తీశారు. ఇరవై రోజుల అవుతున్నా బోరు మోటర్‌కు మరమ్మతు పనులు చేయించ లేదు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదనని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ కాలనీలో నెలకొన్న మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కారించాలని కోరుతున్నారు. – కీసర, ఆగస్టు 30

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 30: వినాయక నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. జిల్లాలోని 17 చెరువులు వినాయక నిమజ్జనానికి అందుబాటులో ఉన్నాయని, చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఉద్దేశించి అన్నారు. అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, రాచకొండ డీసీపీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు బహుమతులు

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా బహుమతులను అందజేశారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. – మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 30

వాలీబాల్ పోటీల విజేతలకు..

ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా గురువారం మేడ్చల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. విన్నర్‌గా కిష్టాపూర్ జట్టు నిలువగా, రన్నర్‌గా పూడూరు జట్టు నిలిచింది. మొదటి స్థానంలో నిలిచిన కిష్టాపూర్ జట్టుకు రూ.20వేల నగదుతో పాటు కప్, ద్వితీయ స్థానంలో నిలిచిన పూడూరు జట్టుకు రూ.10వేల నగదుతో పాటు కప్‌ను ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. – మేడ్చల్

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మేడ్చల్, ఆగస్టు 30 : విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లో ఉన్న మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యాంటీ డ్రగ్ నార్కోటిక్స్, యాంటీ ర్యాంగిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో గంజాయితో పాటు సింథటిక్ డ్రగ్స్ వాడకం పట్టణాలలో పాటు గ్రామీణ ప్రాంతాలకు వ్యాపించిందన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ర్యాగింగ్ విష సంస్కృతికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానమే తరగని సంపద : ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



గోరటి వెంకన్నను సన్మానిస్తున్న ఎన్ఆర్ఈసీ చైర్మన్ నర్సింహారెడ్డి

మేడ్చల్, ఆగస్టు 30 : జ్ఞానమే తరగని సంపద అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇంజినీరింగ్ చేరిన మొదటి ఏడాది నుంచి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా డీజీ రామమూర్తి, చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, కళాశాల డైరెక్టర్ మోహన్‌బాబు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ వెంకట్‌రావు, ఎస్ఏసీ కన్వీనర్ శైలజారెడ్డి, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక నవరాత్రులను సంతోషంగా జరుపుకోవాలి : ఎమ్మెల్యే

వినాయకచవితి ముందస్తు ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా, ఆగస్టు 30 : వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ డిప్యూటీకమిషనర్ జగన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వినాయక చవితి, నిమజ్జన ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులుతో ఏర్పాటు చేసిన సమావేశానికి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే గణపతి మండపాలు, నిమజ్జనాల సందర్భంగా మహిళలు, చిన్నారుల భద్రతపట్ల పోలీసు అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కుషాయిగూడ ఏసీపీ మహేశ్, సీఐ అంజయ్య, జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ ఈఈ హరిలాల్, జలమండలి డీజీఎం సతీశ్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిజ్ఞానం సుసంపన్నానికి సదస్సులు దోహదం చేస్తాయి

సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ నయీం హనూన్, సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి

మేడ్చల్, ఆగస్టు 30 : పరిజ్ఞానం సుసంపన్నానికి సదస్సులు దోహదం చేస్తాయని మలేషియా ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నయీం హనూన్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఇంటలిజెంట్ కంప్యూటింగ్ అండ్ కమ్యూనికేషన్ అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ పరిశోధన, అభివద్ధి విభాగం డైరెక్టర్ కామాక్షి ప్రసాద్, కిట్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ చంద్ర సత్పతి, అమెరికాకు చెందిన సుకన్య, పూర్వాంచల్ యూనివర్సిటీ విక్రాంత్, సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి, కార్యదర్శి వసంతలత, వైస్ చైర్మన్ అభివన్ రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

పీర్జాదిగూడ నూతన మేయర్‌గా అమర్‌సింగ్

నూతన మేయర్‌గా బాధ్యతలు తీసుకుంటున్న అమర్‌సింగ్

పీర్జాదిగూడ, ఆగస్టు 30 : ఈనెల 9వ తేదీన గత మేయర్ జక్క వెంకట్‌రెడ్డి పై కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు ఎన్నిక ప్రిసైడింగ్ అధికారి కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 11.30 గంటలకు నూతన మేయర్ నామినేషన్ స్వీకరించారు. మేయర్‌కు అమర్‌సింగ్ నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో అధికారికంగా ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. మేయర్‌గా అమరసింగ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్పొరేషన్ పరిధి ప్రధాన రహదారుల గుండా ఎన్నికైన మేయర్‌తో కాంగ్రేస్ నాయకులు, పార్టీ శ్రేణులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ జిల్లా పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత సేవలకు గుర్తింపు

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

విధి నిర్వహణలో అందించిన ఉన్నతమైన సేవలకు కలకాలం గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పీజీహెచ్ఎం రామచంద్రం ఉద్యోగ విరమణ సభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ